
సాక్షి
తిరుపతి

శనివారం । 18 । అక్టోబర్ । 2025



కలెక్టరేట్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

తిరుపతి కలెక్టరేట్ కార్యాలయాన్ని పేల్చి వేస్తామని బెదిరింపుల మెసేజ్ రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. - 10లో



మామిడి రైతుకు దక్కని గిట్టుబాటు

మామిడి రైతులకు రాయితీ అరకొర చెల్లింపులపై నిరాశ చెందారు. - 10లో



యువతకు మెరుగైన ఉపాధి కల్పించాలి

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. - 10లో

న్యూస్‌రీల్

‘శ్రీనివాసా’ ఇదేంది స్వామీ?

- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడిపై ఆరోపణలు
- వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు దుర్వినియోగం చేశారని లేఖలు



శ్రీశ్రీశ్రీ శివానంద స్వామి టీటీడీ ఈఓ, సీవీ అండ్ ఎస్‌ఓకి రాసిన లేఖ

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శివకామేశ్వరి శక్తి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివానంద స్వామి టీటీడీ ఈఓ, టీటీడీ సీవీ అండ్ ఎస్‌ఓకు లేఖ రాశారు. టీటీడీ కేటాయించిన వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు విక్రయంపై విచారణ చేయాలని ఆలేఖ ద్వారా కోరారు. ఆ లేఖలో ఏమని పేర్కొన్నారంటే.. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను దుర్వినియోగం చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని తెలిపారు. టీటీడీ నుంచి పొందిన వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు ఆయన వనం శ్రీనివాస్ అనే దళారీ ద్వారా భక్తులకు ఒక్కో లెటర్‌ను రూ.20వేల చొప్పున విక్రయించినట్లు తనకు సమాచారం లభించినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలు భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉండడంతో పాటు, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయన్నారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామికి టీటీడీ ద్వారా ఎన్ని వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు జారీచేశారో, ఆ టికెట్లు ఎవరెవరికి ఇచ్చారో, వాటి వినియోగం ఎలా జరిగిందో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. భక్తుల వద్దకు టికెట్లు విక్రయించినట్లు నిరూపణ అయితే తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్వామీజీ ముసుగులో దళారీతో ఆర్థిక లావాదేవీలు నడుపుతున్నారని శ్రీశ్రీశ్రీ శివానందం స్వామి వివరించడం గమనార్హం. ఈమేరకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

- వార్తలు రాస్తే కేసులు, వేధింపులు
- నకిలీ మద్యంపై పత్రికల్లో ప్రచురిస్తే... తప్పేంటి
- ఇదేమి రాజ్యం చంద్రబాబు
- గాంధీ విగ్రహం వద్ద పాత్రికేయుల నిరసన
- సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్
- జర్నలిస్టుల హక్కుల అణచివేత తగదు



తిరుపతిలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

కలంపై కక్ష

తిరుపతి అర్బన్ : సీఎం చంద్రబాబు జర్నలిస్టులతో రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదు...ఇదేమి రాజ్యం బాబు పత్రికల్లో నకిలీ మద్యంపై వార్తలు ప్రచురిస్తే కేసులు పెట్టి...జర్నలిస్టులను భయపెట్టడం ఎంటీ.. రాష్ట్ర చరిత్రలో ఓ వార్త ప్రచురించారని ఏకంగా ఎడిటర్‌పై కేసు పెట్టడం ఇప్పటి వరకు జరగలేదు బాబు అంటూ తిరుపతి పాత్రికేయులు కూటమి సర్కారు వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా హైదరాబాద్‌లో సాక్షి కార్యాలయానికి పోలీసులు వెళ్లడం...ఎడిటర్ ధనంజయరెడ్డిని ప్రశ్నించడం ఏంటో తెలియడం లేదని పలువురు జర్నలిస్టులు మండిపడ్డారు. తిరుపతిలోని బస్టాండ్ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సంఘాల ప్రతినిధులు అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి

జర్నలిస్టుల వృత్తి సమాజంలో జరుగుతున్న మంచితో పాటు చెడును తెలియజేయడం ద్వారా అధికార యంత్రాంగం తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో పత్రికలు పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వ ఆలోచన మాత్రం మరోలా ఉందని మండిపడ్డారు. తప్పు ఒప్పులతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి జర్నలిస్టులు భజన చేయాలని భావించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. మీడియాపై కక్ష సాధింపులకు పాల్పడిన ఏ ప్రభుత్వానికి మనుగడ లేకుండా పోయిందని హెచ్చరించారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ భక్తవత్సలనాయుడుకు అక్రమ కేసుల అంశాన్ని వివరించారు. గతంలో పోలీసులకు మద్దతుగా కథనాలు రాస్తే కేసులు పెట్టారు. తాజాగా నకిలీ మద్యంపై కథనాలు రాస్తే సాక్షి ఎడిటర్‌పై కేసులు పెట్టడం న్యాయమా అని ప్రశ్నించారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. కార్యక్రమంలో సాక్షి పత్రిక బృందంతో పాటు తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి బాలచంద్ర, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబాబు, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నగేష్, విజయ యాదవ్, జయశంకర్, ఉమాశంకర్, ప్రసాద్, మోహన్, సుబ్రమణ్యం, చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో కదం తొక్కిన పాత్రికేయులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపిస్తున్న పత్రికలపై కేసులు నమోదు చేయడం.. వేధింపులకు గురిచేయడం.. ప్రశ్నించే కలానికి సంకెళ్లు వేయడం ఏమిటని ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్ క్లబ్ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీడబ్ల్యూజే), చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని, వేధింపులు మానుకోవాలని డీఆర్‌ఓ మోహన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.



చిత్తూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పాత్రికేయులు

కేసులతో మీడియా స్వేచ్ఛను హరించలేరు



మీడియాపై కేసులు పెట్టి భయపెట్టాలని చూడడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. వార్తలు ఏదైనా పొరపాటు ఉంటే ఖండన ఇవ్వడం చేయొచ్చు. అలా కాకుండా కేసులు పెట్టడం సరైంది కాదు. మీడియా స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నకిలీ మద్యం కథనాలు, గతంలో పోలీసులకు జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపడంలో తప్పు లేదు.

-కే. గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్

పత్రికను టార్గెట్ చేయడం మంచిది కాదు



ప్రభుత్వం ఓ పత్రికను టార్గెట్ చేయడం మంచి పద్ధతి కాదు. అలా చేయడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది. అత్యధికంగా సర్క్యులేషన్ ఉన్న సాక్షి పత్రిక ఎడిటర్‌ను పోలీసులు పదే పదే ప్రశ్నిస్తే...ప్రజలు ఆలోచన చేస్తారు. ఏ ప్రభుత్వం శాశ్వతం కాదు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం మారితే...అప్పుడు పరిస్థితులు ఎంటీ..? పత్రికను ఎప్పుడు జర్నలిస్టుల కోణంలోనే చూడాలి.

-నగేష్, సీనియర్ జర్నలిస్ట్

జర్నలిస్టులపై కేసులా..



జర్నలిస్టులపై కేసులు పెట్టడం ఎంటో తెలియడం లేదు. నకిలీ మద్యంపై సాక్షిలో కథనాలు వస్తే...వివరణ ఇవ్వాలే తప్ప ఇలా కేసులు పెట్టడం సరికాదు. గతంలో పోలీసుల పదోన్నతులపై కథనాలు రాస్తే కేసులు పెట్టారు. ఇలా ఓ పత్రికపై కక్ష కట్టి వేధించడం ఏ మాత్రం న్యాయం కాదని భావిస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇకనైనా కక్ష సాధింపులు మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే సమిష్టిగా రాష్ట్రస్థాయిలో పోరాటాలు చేస్తాం.

– ఆర్. మురళి, తిరుపతి ప్రెస్ క్లబ్, అధ్యక్షుడు

మీడియాను భయపెట్టాలని చూస్తే కుదరదు



మీడియాను భయపెట్టి తమ చేతుల్లో ఉంచుకోవాలని కూటమి సర్కారు భావిస్తే అది కుదరదు. ఏ పత్రిక అయినా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతుంటారు. ప్రభుత్వం చేస్తున్న లోటుపాట్లను ప్రచురిస్తారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న జర్నలిస్టులు వారి డ్యూటీ వారు చేస్తుంటారు. అయితే కూటమి సర్కారు కక్ష పూరితంగా ఏకంగా సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులను బనాయించడం ఏ మాత్రం సరికాదు. ప్రభుత్వం మీడియా పట్ల తీరుమార్చుకోవాలి.

-బాలచంద్ర, తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి

దశాబ్దాలుగా జర్నలిజంలో కొనసాగుతున్నాం



దశాబ్దాలుగా జర్నలిజంలో కొనసాగుతున్నాం. ఏ పార్టీతోనూ మాకు సంబంధం లేదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా సర్కార్ చేపడుతున్న మంచి, చెడు రెండింటిని ప్రజలకు తెలియజేస్తుంటాం. కథనంలో తప్పులు ఉంటే వాటిపై ఖండన ఇవ్వడం పద్ధతిగా ఉంటుంది. కానీ పోలీసులను హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయానికి పంపి...అక్కడ పనిచేస్తున్న జర్నలిస్టులతోపాటు బ్యూరో స్థాయి ఉద్యోగులనే కాకుండా ఏకంగా ఎడిటర్‌పై కేసులు పెట్టడాన్ని ప్రజలు హర్షించరు.

- నారాయణరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు

సర్కారు తీరు మారాలి



ప్రభుత్వం తీరు మారాల్సి ఉంది. రాష్ట్రంలో జర్నలిస్టులను టార్గెట్ చేయడం మంచి పద్ధతి కాదు. ఎన్నో కథనాలు రోజు రాస్తుంటాం. వాటిల్లో ఏమైనా తప్పులు ఉంటే ఆ విభాగానికి చెందిన అధికారులు ఖండన ఇవ్వాల్సి ఉంది. అంతే తప్ప కక్ష సాధింపులకు పాల్పడడం ద్వారా తీవ్రమైన వ్యతిరేకత ప్రభుత్వంపై పడుతుంది. ఈ విషయాన్ని పాలకులు గుర్తించాల్సి ఉంది. ప్రధానంగా ఓ పత్రికను టార్గెట్ చేయడం ఏ మాత్రం సరైనది కాదు. ఇప్పటికే ఈ అంశంపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చసాగుతుంది.

– ఉమాశంకర్, జర్నలిస్ట్, తిరుపతి

పత్రికను వేధించడం సరికాదు



పదేపదే ఓ పత్రికను వేధించడం సరికాదు. అనేక పత్రికల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలపై కథనాలు వస్తున్నాయి. అయితే సాక్షి పత్రికను మాత్రమే ఎంపిక చేసుకుని వారిని వేధించడం కక్ష సాధింపుగానే భావించాల్సి ఉంటుంది. ఇతర పత్రికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఏ ప్రభుత్వం అయినా జర్నలిస్టులను సమానంగా మాత్రమే చూడాలని కోరుతున్నాం. అంతే తప్ప ఇలా వేధింపులకు పాల్పడడం ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తప్పదు.

-జయశంకర్, సీనియర్ జర్నలిస్ట్, తిరుపతి

కొల్లగొట్టు.. అడిగేదెవరు!

గూడూరు నియోజకవర్గంలో ఖనిజ సంపదను లూటీ చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండికొడుతున్నారు. గనుల లీజుల కాల పరిమితి దాటిపోయినా తవ్వకాలు ఆగడంలేదు. లీజు కాలం ముగిసిందని అడిగే అధికారి లేరు. ప్రభుత్వ సంపదను అక్రమంగా దోచేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారులకు చెవికెక్కడం లేదు. స్థానికంగా ఉన్న ఓ కూటమి నేత అండదండలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి ఖనిజ సందను కొల్లగొడుతున్నారు. అధికారుల నుంచి నేతల వరకు ముడుపులు ముట్టజెబుతుండడంతో తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఉన్నతాధికారులైనా ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తారో లేదో వేచి చూడాల్సిందే.!

- ఖనిజ సంపదను లూటీ చేస్తున్న కూటమి నేతలు
- అనుమతి లేకుండా తెల్లరాయి తరలింపు
- రాయల్టీ చెల్లింపులు ప్రైవేటుకు అప్పగించినా ఆగని అక్రమాలు
- గనుల లీజు గడువు ముగిసినా ఆగని దందా
- కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు హుళక్కే
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- పట్టించుకోని అధికారులు



గనుల్లో తవ్వకాలు చేస్తున్న యంత్రాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఖనిజ సంపదపై కన్నేసి అక్రమ మార్గంలో తవ్వి పచ్చనేతలు జేబులు నింపుకుంటున్నారు. అక్రమంగా ఖనిజ సంపదను తరలించడంలో స్థానిక నేత అండ దండలు ఉండడంతో గూడూరులో దొరికే ఖనిజ సంపద అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

2024లో కాలం ముగిసినా..

50 ఏళ్లకు గూడూరు మండలం కందలిలోని మైన్స్‌కు అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం 2024 నవంబర్ నాటికి కాల పరిమితి పూర్తి అయ్యింది. అయితే మైనింగ్ యజమానులు రెండవ సారి దరఖాస్తు చేసుకున్న 20 ఏళ్ల కాల పరిమితిని బూచిగా చూపుతూ స్థానిక కూటమి నేతల అండ దండలతో గనుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి తెల్లరాయితో పాటుగా ఇతర ఖనిజాలను తరలించేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎవరైనా ప్రశ్నిస్తే గనుల్లో గతంలో తవ్విన గుంతల్లో మట్టి నింపేందుకు పనులు చేస్తున్నామని చెబుతున్నారు. రాత్రి పూట తవ్వకాలను చేపట్టి మెటీరియల్‌ను మరోచోట డంప్ చేసి తరలించేస్తున్నారు.

స్థానిక నేతల అండదండలు

గూడూరు నియోజకవర్గంలో దొరికే తెల్లరాయి, సిలికా, ఇసుక, లాంటి ఖనిజాలు అక్రమ తవ్వకాలు ఆగకుండానే కొనసాగుతున్నాయి. తెల్లరాయిని రాత్రి సమయంలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెల్లరాయి తవ్వకాలను పూర్తి స్థాయిలో కట్టడి చేసినట్లు కనికట్టు చేసినా లోపల జరిగే తంతు మాత్రం అడ్డుకోలేకపోతోంది. గూడూరు మండలం కందలి గ్రామంలో ఉన్న ఓ మైన్‌కు లీజుల కాల పరిమితి అయిపోయినా యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టి తెల్లరాయిని దర్జాగా తరలించేసి సొమ్ము చేసుకుని జేబులు నింపుకుంటున్నారు.

చెక్ పోస్టులు పెట్టినా ..

మైనింగ్‌కు సంబంధించిన ప్రతి ఖనిజానికి లీజుదారులు ప్రభుత్వానికి రాయిల్టీ చెల్లించాల్సి ఉంది. ఈ రాయిల్టీ ప్రభుత్వానికి అందడం లేదని ఇటీవల ఓ ప్రవేటు ఏజెన్సీకి రాయిల్టీ వసూళ్లకు అనుమతి ఇచ్చింది. వారు పలు ప్రాంతాలలో చెక్ పోస్టులు పెట్టారు. అయితే కందలిలోని మైనింగ్ యజమానులు గతంలో తవ్వి నిల్వ ఉంచిన తెల్లరాయిని తరలించుకునేందుకు అనుమతులు లేకపోయినా ఉన్నట్లు చెబుతూ అక్రమంగా తెల్లరాయిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలకు తూట్లు

మైనింగ్ లీజు పొందిన వారు కాల పరిమితి తీరిపోయిన తరువాత తవ్వకాలు చేపట్టిన భూమికే కాకుండా అదనంగా ఉండే ప్రాంతానికి కూడా డెడ్ రెంట్ చెల్లించాల్సి ఉంది. అయితే అలాంటివి ఏమి చెల్లించకుండా ఖాళీగా ఉండే భూమిలో తవ్వకాలు చేసి గతంలో తవ్విన గుంతలను నింపి వేస్తున్నారు. ఇలాంటి వాటిపై గనుల శాఖాధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చినా స్థానిక నేత అండ దండలు మెండుగా ఉండడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.

అధికారులు ఉన్నట్లా..లేనట్లా..!

గూడూరు మండలం కందలి గ్రామ సమీపంలో కాలం చెల్లిన మైన్‌లో ప్రతి రోజు అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు చేపడుతున్నారని రెవెన్యూ, గనులశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఏ ఒక్క అధికారి అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో కూటమి నేతలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారులు పట్టించుకోకపోవడపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.134,290
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.12,092
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,82,000
రిటైల్ వెండి గ్రాము	రూ.191.00

క్లుప్తంగా

జనసేన నాయకుడి అరెస్టు


పోలీసుల అదుపులో వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరి జనసేన పార్టీ నాయకుడు గూడూరు వెంకటేశ్వర్లను శుక్రవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఏడుకొండలు కథనం మేరకు.. గూడూరు వెంకటేశ్వర్లు ప్రభుత్వం విధి విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా గూడూరు వెంకటేశ్వర్లు గతంలో జనసేన పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇటీవల ఆయనను పార్టీ సస్పెండ్ చేసింది. కానీ వెంకటేశ్వర్లు తాను జనసేన కార్యకర్త అని, పవన్‌కల్యాణ్ అభిమానిగా సోషల్ మీడియాతో పోస్టులు పెడుతుంటారు. ఈక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన బహిష్కృత నేత వినుత కోటకు న్యాయం జరగాలి .. టీడీపీ ఎమ్మెల్యేని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సోషల్ మీడియాలో గూడూరు వెంకటేశ్వర్లు పోస్టులు పెట్టారు. అంతేగాకుండా వెంకటగిరిలో అభివృద్ధి జరగడం లేదని, పోలేరమ్మ తల్లి జాతరలో వైఫల్యాలు జరిగాయంటూ మీడియా సమావేశం నిర్వహించి విమర్శించారు. ఈ నేపథ్యంలోనే గూడూరు వెంకటేశ్వర్లుపై కక్ష సాధింపు అరెస్టులు జరిగి ఉండవచ్చునని వెంకటగిరి పట్టణ వాసులు భావిస్తున్నారు.

శ్రీవారికి కొప్పెర హుండీ విరాళం


తిరుమల ఆలయం వెలుపల కొప్పెర హుండీతో దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర హుండీ విరాళంగా అందింది. తిరుపతి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పెర సాయిసురేష్ ఈ మేరకు హుండీని ఆలయంలో పోటు పేష్కార్ మునిరత్నంకు అందించారు. రాగి, ఇత్తడితో కలిపి తయారు చేసిన ఈ హుండీ బరువు 70 కిలోలు ఉంటుందని, దీని విలువ రూ.2.50 లక్షలని దాత తెలిపారు. తాము 1821 సంవత్సరం నుంచి వంశ పారంపర్యంగా స్వామివారికి కొప్పెర హుండీలు సమర్పిస్తున్నామని వెల్లడించారు.

వసూళ్ల పండగ!

- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో టపాసుల దుకాణాలకు ఆమ్యామ్యాలు
- అందినకాడికి దోచుకుంటున్న కూటమి నేతలు, అధికారులు
- దీపావళిని కాసుల పండుగగా మార్చేసిన అగ్నిమాపకశాఖ
- లంచం ఇవ్వకపోతే కొర్రీల పేరుతో ఇబ్బందులు

చిత్తూరు కలెక్టరేట్ : దీపావళిని కూటమి నేతలు, అధికారులు కాసుల వసూళ్ల పండుగా మార్చేశారు. టపాసుల దుకాణాలకు నిబంధనలను పక్కాగా పాటించినా తమ చేతులు తపడకుంటే అనుమతులు జారీచేసేది లేదని అగ్నిమాపకశాఖ అధికారులు తెగేసి చెబుతున్నారు. దీపావళి సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక దుకాణాల ఏర్పాటులో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారుల తీరు ఇలా ఉంటే.. దుకాణాల యజమానులు మాత్రం అడిగినంత లంచం ఇచ్చి అందినకాడికి దోచుకుందామనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

రెండు జిల్లాల్లోనూ లంచాల పర్వం

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో దాదాపు 283 వరకు తాత్కాలిక టపాసుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. టపాసుల విక్రయాల్లో మార్జిన్ 50 శాతం కంటే ఎక్కువగా ఉండడంతో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుకు పోటీ పెరిగింది. నిబంధనలు పాటించకున్నా మామూళ్లు ఇస్తే ఏమైనా చేసుకోవచ్చని, ఏ రేట్లకైనా అమ్ముకోవచ్చనే ఆలోచనలో ఉన్నారు. దీంతో ఈ ఏడాది దుకాణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖలో ఇద్దరు అధికారులకు రెగ్యులర్ దుకాణాలకు ఒక్కొక్క ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లకు రూ.50 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. తాత్కాలిక దుకాణాలకు ఒక్కొక్కరి నుంచి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు లంచం డిమాండ్ చేస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో తాత్కాలిక టపాసుల దుకాణాలకు అనుమతులు కావాలంటే ప్రతి షాపునకు రూ.25 వేల చొప్పున స్థానిక కూటమి ప్రజాప్రతినిధికి ముట్టుజెప్పుకోవాల్సిందే. దీంతో పాటు అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులకు సైతం అదనంగా లంచం ఇచ్చుకుంటేనే అనుమతులు దక్కే పరిస్థితి నెలకొంది.


చిత్తూరులో తాత్కాలిక టపాసుల షాపులు ఏర్పాటు చేస్తున్న వ్యవసాయమార్కెట్ స్థలం

తనిఖీలు తూచ్

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాగుతున్న అక్రమ టపాసుల వ్యాపారాలను అరికట్టడంతో పాటు అనుమతులు జారీచేస్తున్న ఆయా శాఖల్లో జరుగుతున్న లంచగొండుతనాన్ని అరికట్టడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి వహించాల్సిన అవసరం ఉంది. సేల్స్ ట్యాక్స్ అధికారులు ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని టపాసుల గోడౌన్‌లలో ఎంత మేరకు నిల్వలు ఉన్నాయి.. ఎంత మొత్తానికి ట్యాక్స్‌లు చెల్లించారు..? అన్న విషయాలను అధికారులు పట్టించుకోవడం లేదు.

అనుమతి పేరుతో భారీగా వసూళ్లు

టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్, అగ్నిమాపక, శానిటేషన్, మున్సిపాలిటీ, నగరపాలక శాఖల నుంచి ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోవాలి. పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నిబంధనలకు అనుగుణంగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అనుమతులను జారీచేస్తారు. చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు, జీడీ నెల్లూరు, పూతలపట్టు, నగరి, చిత్తూరు, పుంగనూరుతో పాటు తిరుపతి జిల్లాలోని తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, చంద్రగిరి, నాయుడుపేట, సత్యవేడు, వెంకటగిరిలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో 10 నుంచి 40 వరకు తాత్కాలిక షాపులను పెడుతున్నారు. వీటన్నింటికీ అధికారుల నుంచి తాత్కాలిక అనుమతులు పొందాల్సి ఉంటుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తాత్కాలిక టపాసుల దుకాణాల ఏర్పాటుకు అందిన కాడికి దోచుకుంటున్నారు. లంచం ఇవ్వకపోతే ఏదో ఒక కారణంతో కొర్రీలు వేసి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారు.

బిల్లులు ఉండవు.. ట్యాక్స్ చెల్లించరు

వినియోగదారులు వస్తువులు కొన్న తర్వాత దుకాణాదారుడు రసీదు ఇస్తారు. కానీ, టపాసుల విక్రయాల్లో మాత్రం జీరో బిజినెస్ నడుస్తోంది. టపాసులకు సంబంధించి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. విక్రయాలు సాగించిన మొత్తానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. అయితే, వ్యాపారులు ఎలాంటి ట్యాక్స్‌లు చెల్లించకుండానే అక్రమ వ్యాపారాలకు తెరలేపుతున్నారు. మరోవైపు టపాసుల రేట్లు సైతం అధికంగా పెంచి విక్రయించే ఆలోచనలో దుకాణాదారులున్నట్లు తెలుస్తోంది. సిండికేట్‌గా మారి అందరూ ఫిక్స్ రేట్లను పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

భూరికార్డుల మార్పుపై ఒంటిపై డీజిల్ పోసుకుని నిరసన


నిరసన తెలుపుతున్న పాండురంగయ్య

బుచ్చినాయుడు కండ్రిగ : ఆన్‌లైన్‌లో భూ రికార్డులు మార్పు చేయడంపై తహసీల్దారు కార్యాలయంలోని చాంబర్ వద్ద బాధితుడు పాండురంగయ్య శుక్రవారం డీజిల్ పోసుకుని నిరసన తెలపడంతో రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ.. మండలంలోని పల్లమాల గ్రామ రెవెన్యూలో సర్వే నంబర్ 79-3లో తన తల్లి అనసూయమ్మ పేరున ఆన్‌లైన్‌లో 5 ఎకరాల భూమి ఉందన్నారు. దీన్ని తహసీల్దారు పల్లమాల గ్రామానికి చెందిన రవీంద్రబాబు పేరుతో ఈనెల 8వ తేదీన మార్చారని తెలిపారు. రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగానే అనుసూయమ్మ పేరున ఉన్న భూమిని రవీంద్రబాబు పేరుతో మార్చారని ఆరోపించారు. ఈ ఘటనపై తహసీల్దారు శ్రీదేవి స్పందిస్తూ పల్లమాల గ్రామానికి చెందిన గోవిందమ్మ పేరుతో 5 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌కు చెందిన పాండురంగయ్య గోవిందమ్మ పేరుతో ఉన్న భూమిని తన తల్లి అనసూయమ్మ పేరుతో ఆన్‌లైన్‌లో 2020లో మార్చుకున్నారని తెలిపారు. దీనిపై గోవిందమ్మ కొడుకు రవీంద్ర తన వద్ద ఉన్న రికార్డులతో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు భూ రికార్డులను మార్చామని తెలిపారు.

కలెక్టరేట్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

తిరుపతి అర్బన్ : తిరుపతి కలెక్టరేట్ కార్యాలయానికి మళ్లీ బాంబు బెదిరింపులు తప్పలేదు. శుక్రవారం ఏకంగా కలెక్టరేట్ భవనాన్ని పేల్చి వేస్తామంటూ సంక్షిప్త సందేశాలు రావడంతో అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో బెదిరింపులు వచ్చిన సందర్భంగా బాంబు పెట్టామని సమాచారం ఇచ్చారు. ఈ సారి పేల్చి వేస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో పాటు ఉదయం 10 గంటల సమయంలో మెసేజ్ పెట్టారు. దీంతో ఉద్యోగులు భయం భయంగా డ్యూటీలు చేశారు. కొందరు అయితే డ్యూటీకి వచ్చి చిన్న పని ఉందంటూ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు సమాచారం అందుకున్న వెంటనే బాంబు నిర్వీర్య దళం, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణం అంతటా ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించిన పోలీసులు ఎటువంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో అది తప్పుడు సమాచారంగా నిర్ధారించారు. ఈ సంఘటనతో కొంతసేపు కలెక్టరేట్ ప్రాంగణంలో మొత్తం హడావుడి పరిస్థితి నెలకొంది. అనంతరం పరిస్థితి సద్దుమణిగింది. మెసేజ్ చేసిన వ్యక్తి వివరాలు కనుగొనేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ తరహా తప్పుడు సమాచారం ఇచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ వెల్లడించారు.


కలెక్టరేట్‌లో తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్, పోలీసులు

కుటుంబ కలహాలతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని కందాడ దళితవాడకు చెందిన సచివాలయ ఉద్యోగి కుటుంబ కలహాలతో గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు. ఏర్పేడు మండలం కందాడ దళితవాడకు చెందిన బొంద మునెయ్య, సాయమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో రెండవ కుమారుడు బొంద నిరంజన్(27) శ్రీకాళహస్తి మండలం బీవీ పురం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కందాడ దళితవాడకు చెందిన సుబ్రమణ్యం, చంద్రికల కుమార్తె విద్యప్రియను నిరంజన్ ఈ ఏడాది మార్చి 12న వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం నిరంజన్ భార్య విద్యప్రియ గర్భిణి. పెళ్లైన తర్వాత కొంత కాలం సజావుగా జరిగిన వీరి కాపురం అత్తమామలు, భార్య వేధింపులకు తోడు అప్పులు ఎక్కువ కావడంతో మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో నిరంజన్ గురువారం రాత్రి గ్రామ శివారున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు.

అమ్మా.. నాన్నా ఇక సెలవు..

మృతుడు నిరంజన్ వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను బట్టి అత్తమామలు, భార్య వేధింపులు, అప్పులు ఎక్కువ కావడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. లేఖలో.. 'పోలీసు వారికి మనవి.. నాకు పెళ్లైనప్పటి నుంచి మా భార్య, వాళ్ల అమ్మ, హేమలత(పెద్దమ్మ) నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నారు. నాభార్య కూడా నన్ను చంపేదాక తీసుకొచ్చారు. దానికి రిలేటెడ్‌గా కాల్‌డేటా తీయండి సార్.. దయచేసి నాకు న్యాయం చేయండి సార్.. వీళ్లు నన్ను టార్చర్ పెట్టి చంపేసి నా భార్యకు వేరే పెళ్లి చేయాలని చూస్తున్నారు.. మా అమ్మా,నాన్న, అన్న, వదిన, తమ్ముడును కాపాడండి సార్.. 'అమ్మా.. నాన్నా సారీ నాన్నా.. ఇక సెలవు.. ఇంకో జన్మలో మిమ్మల్ని బాగా చూసుకుంటా..' వాళ్లు నా దగ్గర చాలా అప్పులు చేయంచారు. నేను కట్టలేని అప్పులు చేపించారు. దయచేసి వీళ్లను వదలొద్దు అంటూ సూసైడ్‌నోట్‌లో నిరంజన్ రాసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ కోణంలో మృతుని భార్య, అత్తమామలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


నిరంజన్ (ఫైల్)

యువతకు మెరుగైన ఉపాధి కల్పించాలి

తిరుపతి అర్బన్ : కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సింగిల్ డెస్క్ విధానంలో మే, 2025 నుంచి 2378 పరిశ్రమలకు గాను 2314 అనుమతులు ఇచ్చామని మరో 58 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 33 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ. 5.49 కోట్లు అందించడానికి ఆమోదం తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ ఏ.పి.ఐ.ఐ.సి విజయ భరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, రవాణా శాఖ అధికారి మురళి మోహన్, ఎల్.డి.ఎం రవి కుమార్ పాల్గొన్నారు.

22న జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులతో కలిసి శుక్రవారం జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ నెల 22న సూళ్లూరుపేట సత్యసాయి కల్యాణ మండపంలో జాబ్ మేళా ఉందని చెప్పారు. తమతో పాటు పలువురు అధికారులు, పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు వస్తారని వెల్లడించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈ నెల 20వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పదో తరగతి నుంచి ఇంటర్, ఏదైనా డిగ్రీ లేదా పీజీ చదువుకున్న యువతి యువకులు అర్హులుగా పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 9121646661, 9985056929, 9988853335 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, పరిశ్రమలశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ భరత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి, జిల్లా ప్లేస్ మెంట్ అధికారి గణేష్ పాల్గొన్నారు.

మామిడి రైతులకు దక్కని గిట్టుబాటు

బుచ్చినాయుడుకండ్రిగ : రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి రకానికి టన్నుకు ఫ్యాక్టరీల నుంచి రూ. 8 వేలు, ప్రభుత్వం నుంచి రూ. 4 వేలు సబ్సిడీగా అందిస్తామని చెప్పి, ఇప్పుడు సబ్సిడీ రూ. 4 వేలు ఫ్యాక్టరీల నుంచి రూ. 4 వేలే రైతులకు దక్కుతుందని చెబుతున్నారు. దీంతో మామిడి రైతులకు గిట్టుబాటు ధర దక్కకుండా పోయింది. మొత్తంగా తోతాపురి మామిడికి రూ. 12 వేలు వచ్చేలా చేస్తామని కూటమి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చెప్పారు. చిత్తూరు పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం ఇదే మాట చెప్పారు. టన్నుకు రూ. 12 వేలు ఇస్తే కనీసం పెట్టుబడులైనా వస్తాయని మామిడి రైతులు ఆశ పడ్డారు. ఫ్యాక్టరీ యాజమాన్యం టన్నుకు రూ. 4 వేలు మాత్రమే రైతుల ఖాతాలలో జమ చేశారు. సబ్సిడీ రూ. 4 వేలు ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమ అయింది. మిగిలిన రూ. 4 వేలు చెల్లించాలని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే ఇచ్చేది అంతే అంటూ సమాధానం చెబుతుండడం గమనార్హం. మండలంలోని గాజులపెళ్లూరు గ్రామంలోని రసా జ్యూస్ ఫ్యాక్టరీకి 12 వేల టన్నుల మామిడి కాయలను రైతులు తోలారు. టన్నుకు రూ. 4 వేలు చొప్పున 12 వేల టన్నులకు రైతులకు చెల్లించకపోవడంతో రైతులు సుమారు రూ. 5 కోట్లు నష్టపోయారు. అయినా రైతులు చేసేది లేక మౌనంగా ఉంటున్నారు.

పట్టించుకోని అధికారులు

టన్నుకు రూ. 12 వేలు ఇస్తామని తహసీల్దారు శ్రీదేవి, ఉద్యానశాఖ అధికారులు మామిడి కాయలను ఫ్యాక్టరీ తరలించారు. టన్ను రూ. 8 వేలు ఇచ్చారని, రూ. 4 వేలు ఇవ్వలేదని మొర పెట్టుకుంటున్నా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి రావాల్సిన రూ. 4 వేలును ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

మార్కెట్‌లోకి న్యూ విక్టరీస్ కారు

తిరుపతి కల్చరల్ : మారుతీ సుజికీ సరికొత్త ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన న్యూ విక్టరీస్ కారును శుక్రవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. రేణిగుంట రోడ్డులోని భార్గవి ఆటో మొబైల్స్ షోరూంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రవాణా శాఖ అధికారి కె.మురళీమోహన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్ శ్రీనివాస కుమార్ హాజరై నూతన విక్టరీస్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సరికొత్త కారు అత్యధిక సేఫ్టీతో అత్యాధునిక టెక్నాలజీతో చాలా బాగుందని తెలిపారు. మొదటి సారిగా భారత్ ఎన్‌సీఏపీ గ్లోబల్ ఎన్‌సీఏపీ, 5 స్టార్ రేటింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. భార్గవి ఆటో మొబైల్స్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ.. ఎంఐడీఎస్‌యూవీ రేంజ్ కారులో ఏడీఏఎస్ లెవల్-2 ప్రవేశపెట్టారని తెలిపారు. షోరూం ఎండీ కె.నిరంజన్ మాట్లాడుతూ.. ఈ కారు డైనామిక్ ఇన్ మోషన్ డిజైన్‌తో ఎంతో అద్భుతంగా ఉందన్నారు. ఇందులో 4 ఇంజన్ ఆప్షన్స్‌తో స్మార్ట్ హైబ్రిడ్, స్ట్రాంగ్ హైబ్రో, 5 సీఎన్‌జీ ఆల్ గ్రిప్‌తో మార్కెట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ కొత్త కారు ప్రారంభ ధర రూ.10.49 లక్షల నుంచి రూ.19,93,900 వరకు లభిస్తుందన్నారు. అంతే కాక ఈ కారు ఆకర్షణీయమైన పది రంగులలో అందుబాటులో ఉందని తెలిపారు. భార్గవి ఆటో మొబైల్స్ ఈడీ కొండా ఈశ్వర్ మాట్లాడుతూ.. ఈ కొత్త కారులో యువత మెచ్చే ఎంతో ఇష్టమైన మ్యూజిక్, డాల్బీ ఆటోమొడ్స్ హార్మన్ ఆలాంగ్ విత్ అండ్ స్పీకర్స్, సౌండ్ సిస్టమ్స్ సౌలభ్యం ఉందన్నారు. యువతను ఆకర్షించేలా 360 డిగ్రీ కెమెరా సదుపాయంతో పాటు అత్యధిక మైలేజీ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భార్గవి సీజీఎం రమేష్ బాబు, డీజీఎం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


మారుతీ సుజికీ నూతన విక్టరీస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

బినామీల కోసమే ప్రైవేటీకరణ

- బాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు
- జగన్ 2.0తో కార్యకర్తలకు భరోసా
- కోటి సంతకాల సేకరణలో కాకాణి, నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం) : ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు తగ్గరలోనే ఉన్నాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణ ఆంధ్ర రాష్ట్ర పేద బతుకులకు తలరాతలని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు వైద్యం అందేలా గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పగించేందుకు కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన వారు దేశంలో ఇంకెవరూ లేరని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనతో అరాచకాలు పెరిగిపోతున్నాయని వాటికి పదింతలు బుద్ధి చెప్పే విధంగా అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగన్ 2.0 డిజిటల్ బుక్‌ను ప్రవేశ పెట్టారన్నారు. తప్పు చేసిన ఏ ఒక్క అధికారిని వదలిపెట్టే ప్రసక్తేలేదని మరోసారి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలను కూటమి సర్కార్ మోసం చేస్తుందని తెలిపారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి అమలు చేయకుండా పీ-4 అంటూ కాలయాపన చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అనంతరం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై పార్టీతో సంబంధం లేకుండా కోటి సంతకాల కార్యక్రమానికి స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. దీనికి అధికారులు కూడా సమాధానం చెప్పే రోజులు తగ్గరలోనే ఉందన్నారు. తాజాగా జనసేన నేత గూడూరు వెంకటేశ్వర్లు తప్పును ఎత్తి చూపించినందుకు ఆయనపై కూడా కేసు నమోదు చేశారన్నారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మొదటి సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, మండల కన్వీనర్లు, రాష్ట్ర విభాగాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి , చిత్రంలో నేదురుమల్లి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన 17 మెడికల్ కాలేజీలను రాజకీయ కక్షతో ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు పన్నుతోందని కూటమి ప్రభుత్వంపై ప్రజా ఉద్యమం మొదలైందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి 26వ డివిజన్‌లోని బండ్లవీధిలో శుక్రవారం కార్పొరేటర్ తాజిన్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భూమన అభినయ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం మెడలు వంచైనా మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం కాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే పూర్తి చేసి పేదలకు ఉచిత వైద్యం, ఉచిత వైద్య విద్య అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలను పక్కన పెట్టి కేవలం రూ. 6 వేల కోట్లను ఖర్చుపెట్టి మెడికల్ కాలేజీలను పూర్తి చేసి పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, కోటూరు ఆంజినేయులు, బోకం అనిల్‌కుమార్, ఆదిలక్ష్మి, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


తిరుపతి : సంతకాల సేకరణ చేపడుతున్న భూమన అభినయ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి , నేతలు

రైతు సభను అపహాస్యం చేయడం విడ్డూరం


మాట్లాడుతున్న సీపీఐ నేత రామానాయుడు, రైతు సంఘ నేత హేమలత

తిరుపతి కల్చరల్ : రైతుల గోడుపై పూతలపట్టులో ఆక్రందన సభ పెట్టుకుంటే దానిని పూతలపట్టు ఎమ్మెల్యే అపహాస్యం చేయడం దుర్మార్గమని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ జాగీరు కాదని రైతు సంఘాల నేతలు పి.హేమలత, టి.జనార్దన్, సీపీఐ రాష్ట్ర నేత రామానాయుడు ఎమ్మెల్యేకు ఘాటైన సమాధానం చెప్పారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీ ప్రతాపం మామిడి రైతులపై కాదు, ఫ్యాక్టరీలపై చూపించాలని హితవు పలికారు. మామిడి రైతుకు రూ.8 , సబ్సిడీ రూ.4 కలిపి మొత్తం సొమ్ములు రైతులకు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం రూ.4 సబ్సిడీ మాత్రమే చెల్లించిందన్నారు. అది కూడా ఆక్రందన సభకు ముందు రోజు విడుదల చేయడం అంటే అది రైతు సంఘం విజయమని తెలిపారు. బంగారు పాళ్యంలో రైతు సభను జరగనీయకుండా ఎమ్మెల్యే అధికారులతో, ప్రవేటు వ్యక్తులతో భయపెట్టి సభ అడ్డుకోవడం దుర్మార్గమన్నారు.40 ఫ్యాక్టరీలను నియంత్రించలేక 40 వేల మంది రైతులకు అన్యాయం చేయడం మీకు తగదన్నారు. మామిడి రైతులకు సమాధానం చెప్పలేక ఎదురుదాడికి పూనుకోవడం బాధాకరమన్నారు. బెదిరింపులతో మామిడి రైతుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని హితవు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన రూ.370 కోట్ల బకాయిలను తక్షణం ఇప్పించకపోతే జరగబోయే ఉద్యమాలకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.